క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సుగుణ



ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి సీతక్క, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్‌తో కలిసి వెళ్లి ముఖ్యమంత్రిని శాలువాతో సత్కరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చినందుకు సీఎం ఆమెను అభినందించారు. గెలుపోటములు సహజమని, అధైర్యపడవద్దని జిల్లాలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సీఎం సూచించారని సుగుణ తెలిపారు.

భీమన్న దేవునికి పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలోని మైసమ్మ గుట్టపై గల భీమన్న దేవునికి గ్రామస్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, గ్రామ పెద్దలు ఇర్ల నడిపి బాపు, కొండ ముత్తన్న, శేఖర్, రమేశ్, శ్రీనివాస్, చంద్రకాంత్, భూమన్న, శ్రీకాంత్, సుదర్శన్, అనిల్, అమృత్ రావ్ పాటిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

ఎదులాపురం: లయన్స్ క్లబ్ ఆదిలాబాద్ కాటన్ సిటీ అండ్ కింగ్స్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. రోగులు, రోగుల బంధువులకు మజ్జిగను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కరీం అలీ నూరానీ, క్లబ్ సెక్రటరీ భగవాన్ దాస్, దుర్గ, బెజ్జంకి రవీందర్, నరేందర్ గంగయ్య, అనంత్ దేశ్‌పాండే, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.


రైతువేదికలో 'రైతు నేస్తం'

బోథ్: స్థానిక రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా రాజేంద్రనగర్‌లోని డాక్టర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. పత్తిలో అధిక సాంద్రత వల్ల కలిగే లాభాలను వివరించారు. పత్తి విత్తన ఎంపిక, పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించాలో వివరించారు. రెండో పంట వేయడానికి సూచనలు చేశారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఏడీఏ శ్రీధర్‌స్వామి, ఏవో రమేశ్, ఏఈవోలు పాల్గొన్నారు.

నేడు పుస్తకాలు పంపిణీ

తాంసి: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పునఃప్రారంభంలో భాగంగా విద్యార్థులకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేస్తారని ఎంఈవో శ్రీకాంత్ తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో శౌచాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారని తెలిపారు.

ఐకేపీ కార్యాలయంలో అడిట్



అడిట్ నిర్వహిస్తున్న అధికారి

బోథ్: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం అడిట్ నిర్వహించారు. గతేడాది నిర్వహించిన పద్దుల రికార్డులు, 42 గ్రామ సంఘాల రికార్డులను అడిట్ అధికారి నరేందర్ పరిశీలించారు. 2023–24వ ఆర్థిక సంఘంలో నిర్వహించిన లావాదేవీలపై అడిట్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏపీఎం మాధవ్, సీసీ గంగాధర్ తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వస్తున్నారని ఎంపీటీసీ అంబేకర్ పండరి తెలిపారు. గ్రామంలో బుధవారం బడిబాట కార్యక్రమం ఉన్నందున ఈ కార్యక్రమానికి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

సొంత భవనాలేవి?

- ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు కరువు
- కొత్త మండలంలో సమస్యలు అనేకం
- ఇరుకు గదుల్లో ఇబ్బందులు

నార్నూర్: పాలన సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన మండలాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా నార్నూర్ ఉమ్మడి మండలం నుంచి గాదిగూడను కొత్త మండలాన్ని ప్రకటించడంతో గిరిజనులు సంబురపడ్డారు. అన్ని సౌకర్యాలు అందుబాటులో వస్తాయని అనుకుంటే వారి ఆశలు అడియాసలయ్యాయి. కొత్త మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసినా అనేక సమస్యలు వేధిస్తున్నాయి. మండలాన్ని ఏర్పాటు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. దీంతో అధికారులు ఇరుకు గదిలో కాలం వెళ్లదీస్తూ ఇబ్బంది పడుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ ఆఫీసు, బీసీ వసతి గృహం భవనంలో పోలీసుస్టేషన్, ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంపీడీవో, ఎమ్మార్సీ, ఈజీఎస్ మూడు కార్యాలయాలు ఉన్నాయి. ఇక్కడే అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వసతి గృహాల్లో పశువైద్యశాల కేంద్రం, ఐకేపీ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం కొనసాగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సొంత భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



గాదిగూడ పంచాయతీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం



వసతి గృహాల్లో కొనసాగుతున్న పశువైద్యశాల



బీసీ వసతి గృహంలో కొనసాగుతున్న పోలీసుస్టేషన్

వసతులు లేవు



గ్రామ పంచాయతీ భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. ఇరుకుగదుల్లో అధికారులు, సిబ్బందికి ఇబ్బందిగా ఉంది. కనీస వసతులు లేవు. మహిళా ఉద్యోగుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. సొంత భవనం అయితే బాగుంటుంది.

– విజయనందం, తహసీల్దార్ గాదిగూడ

భవనాలు మంజూరు చేయాలి



కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. ఇరుకు గదిలో విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. ఏ ఫైల్ ఎక్కడ పెడుతున్నారో అర్థం కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సొంత భవనాలు మంజూరు చేసి పనులు పూర్తి చేయించాలి.

– ఆద చంద్రకళ రాజు, ఎంపీపీ, గాదిగూడ

పనుల్లో నాణ్యత ఏది?

- నిర్మాణాల్లో నాణ్యత పాటించని కాంట్రాక్టర్లు
- ఆ పనులకు అధికారులు ఎలా ఎంబీ రికార్డు చేస్తారు
- సభలో ప్రశ్నించిన పలువురు ఎంపీటీసీలు
- వాడీవేడిగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ గంద్రత్ రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో నాణ్యత లేకుండా కాంట్రాక్టర్లు సీసీ రోడ్డు, మురుగుకాల్వల నిర్మాణాలు చేపట్టినా అధికారులు (ఎంబీలు) ఎలా రికార్డు చేస్తారని పలువురు ఎంపీటీసీలు ప్రశ్నించారు. ఈ విషయంపై సంబంధిత అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ గంద్రత్ రమేశ్ అధ్యక్షతన ఆదిలాబాద్‌లోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఆదిలాబాద్ రూరల్ మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. శాఖల వారీగా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా భీంసరి ఎంపీటీసీ బిక్కి గంగాధర్ మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్డు, మురికి కాలువల నిర్మాణంలో కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించలేదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. మండలంలో చాలాచోట్ల కాంట్రాక్టర్లు నిర్మాణాల్లో నాణ్యతలు పాటించలేదని, పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించారని మండిపడ్డారు. సదరు అధికారిని ఉన్నతాధికారులకు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి ఒక్కసారికి అవకాశం ఇవ్వాలని, అలాంటి పనులను తిరిగి చేయిస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. ఎంపీపీ గంద్రత్ రమేశ్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే మండలం అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో వెంకటరాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పశువులు అక్రమ రవాణా చేస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ సాయినాథ్

బేల: పశువులు అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో మైనార్టీ, హిందు సంఘాలతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని సూచించారు. పండుగ దృష్ట్యా పశువులను అక్రమంగా తరలించకుండా అన్నిచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. పశువులు అక్రమంగా రవాణా చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్సై రాధిక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫైజుల్లాఖాన్, బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, మాజీ సర్పంచ్ దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్



స్థలానికి సంబంధించిన పత్రాలను అందజేస్తున్న కాలనీవాసులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని 38వ వార్డు కైలాస్‌నగర్‌లోని సొసైటీ స్థలాన్ని కొందరు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కలెక్టర్ రాజర్షి షాకు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మావల తహసీల్దార్ వేణుగోపాల్ మంగళవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. కమిటీ సభ్యులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన పత్రాలను కాలనీవాసులు ఆయనకు అందజేశారు. అలాగే ఆక్రమణదారుల నుంచి కూడా పత్రాలను తెప్పించుకుని పరిశీలించాక ఆర్డీవోకు నివేదిక అందజేస్తానని తహసీల్దార్ వారితో పేర్కొన్నారు. ఆయన వెంట సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు లోక ప్రవీణ్ రెడ్డి, దుర్గం శేఖర్ తదితరులున్నారు.

పెరిగిన ఆన్‌లైన్ విద్యుత్ బిల్లుల చెల్లింపు

ఆదిలాబాద్‌టౌన్: ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు పెరిగిందని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ప్రకటనలో తెలిపారు. టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో మే నెలకు సంబంధించి 23,845 మంది వినియోగదారులు రూ.2.95 కోట్ల విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ విధానంతో బిల్లుల వసూళ్లు 20 శాతం పెరిగినట్లు తెలిపారు. బిల్లును కార్యాలయానికి వెళ్లకుండా ఫోన్ ద్వారానే చెల్లించవచ్చని పేర్కొన్నారు. కొత్తగా బిల్లుపైనే క్యూఆర్ కోడ్ ముద్రిస్తున్నట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా వరంగల్ సర్కిల్ కేంద్రంలో ప్రారంభమైనట్లు వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించండి



పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని జిల్లా సంక్షేమ అధికారి సబితా అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌లో మంగళవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటాపాటలతో విద్యతోపాటు, పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీలో ఇంటింటికి తిరుగుతూ పిల్లలను కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. సీడీపీవో వనజ, సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ టీచర్ రాధ, ఏఎన్ఎం తులసీ, ఫరీదా, వాసల్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో ల్యాన్లు, మొక్కలకు నీటి సరఫరా

సాక్షి స్పందన



జగ్జీవన్‌రాం చౌక్‌లో నీరు పడుతున్న బల్దియా సిబ్బంది

కైలాస్‌నగర్: ఆదిలాబాద్‌లోని ప్రధాన చౌక్‌ల్లో సుందరీకరణలో భాగంగా ఏర్పాటు చేసిన పచ్చదనం, వివిధ రకాల మొక్కలు బల్దియా అధికారుల నిర్లక్ష్యంతో పూర్తిగా ఎండిపోయాయి. ఈ దుస్థితిని వివరిస్తూ ఈనెల 2న 'పచ్చదనం కరువు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. ఎన్టీఆర్‌చౌక్‌లోని వాటర్ ఫౌంటేన్‌కు మరమ్మతు చేయించడంతోపాటు అందులో నీటిని నింపేలా చర్యలు చేపట్టారు. బల్దియా సిబ్బందితో నీటి ట్యాంకర్ల ద్వారా ఆయా చౌక్‌ల్లోని ల్యాన్లతోపాటు మొక్కలకు నీటిని అందించారు. ఈ చర్యలు హర్షనీయమైనప్పటికి పచ్చగడ్డి, మొక్కలు ఎండిపోక ముందే ఇలా నీటిని అందిస్తే ప్రయోజనకరంగా ఉండేది కదా అనే అభిప్రాయాన్ని పట్టణవాసులు వ్యక్తం చేస్తున్నారు.

సుంకిడిలో బడిబాట



సుంకిడిలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తదితరులు

తలమడుగు: బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని హెచ్ఎం రామేశ్వర్ అన్నారు. సుంకిడి గ్రామంలో మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట నిర్వహించారు. ఏపీపీజీ చైర్మన్ కృష్ణవేణి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్ స్వామి, గజానన్, శ్రీనివాస్ రెడ్డి, రామ్‌రెడ్డి, పెట్టుకులే సుకుమార్, శంకర్‌రావు, వినోద, శ్రీవాణి, జ్యోతి పాల్గొన్నారు.

తాంసిలో..

తాంసి: సర్కారు బడిలో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బడిబాటలో భాగంగా మంగళవారం గ్రామసభ నిర్వహించారు. పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్యతోపాటు పాఠశాలలో చేరిన వారి వివరాలను తెలియజేశారు. ప్రత్యేకాధికారి ఎంపీడీవో మోహన్‌రెడ్డి, కార్యదర్శి గంగన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సతీశ్, ఉమా మహేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లిలో..

ఇంద్రవెల్లి: బడిబాటలో భాగంగా కేస్లాపూర్ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న విద్య, సౌకర్యాలపై హెచ్ఎం పంచపుల మంగళవారం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మాజీ సర్పంచ్ మెస్రం రేణుక, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ సులోచన, గ్రామస్తులు ఉన్నారు.

ప్రభుత్వ చిహ్నంలో ప్రతిపాదనలు పరిశీలించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

బోథ్: ప్రభుత్వ చిహ్నాన్ని మారుస్తున్న నేపథ్యంలో ధర్మ సమాజ్ పార్టీ ప్రతిపాదించిన పలు అంశాలను కాంగ్రెస్ సర్కారు పరిశీలించాలని నాయకులు కోరారు. మంగళవారం బోథ్ తహసీల్దార్ సుభాష్ చందర్‌కు వినతిపత్రం అందించారు. చిహ్నంలో అంబేద్కర్, పండగ సాయన్న, సర్వాయి పాపన్న గౌడ్, సమ్మక్క సారలమ్మ చిత్రపటాలను ముద్రించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ వెంకటేశ్, నాయకులు రమేశ్, గణేశ్, పాలెపు గంగయ్య, జైపాల్, శివ, అఖిల్, విజయ్, వాఘ్మారే అశోక్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే కొనసాగుతోంది. కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ అధికారులు గ్రామాల్లో మంగళవారం ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. భగీరథ నీటి నల్లాలు ఉన్నాయా, నీళ్లు వస్తున్నాయా అనే వివరాలు సేకరించారు. ఎంపీడీవో భాస్కర్, ఈవో సంజీవ్‌రావ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుకుమార్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో గల పోస్టుమెట్రిక్ ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వసతి గృహం సంక్షేమాధికారి ఓంప్రకాశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. బీసీ 44, ఎస్టీ 4, ఎస్సీలకు 13 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పుతున్న శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్‌లో చేరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం స్థానిక ప్రజాసేవభవన్‌లో జరిగిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన న్యాయవాది పోరెడ్డి దయాకర్‌తోపాటు జైనథ్ మండలంలోని నిరాల, ఆకూర్ల గ్రామస్తులు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి వారికి కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, ఆశమ్మ, షకీల్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీర్సాముండా వర్ధంతి



విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: భగవాన్ బీర్సాముండా 124వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎదుట గల ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ సంఘాల నాయకులు మెస్రం క్రిష్ణ, గేడం మాధవ్, డొంగ్రే మహేశ్, గేడం సాంబాజీ, కుడ్మేత ప్రకాశ్, దుర్వ ప్రదీప్, గేడం జనార్దన్, నిర్వాహకుడు సిడాం రాంకిషన్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డి లేక తిప్పలు



నేరడిగొండ: స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఒంటికీ.. రెంటికీ కష్టాలు తప్పడం లేదు. కార్యాలయానికి మండలంలోని ఉపాధ్యాయులు సమావేశాలకు వస్తుంటారు. అలాంటప్పుడు మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా మరుగుదొడ్లు నిర్మించేలా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత

బోథ్: మండల కేంద్రానికి చెందిన పోతగౌడ్ గతంలో మృతిచెందాడు. ఆయన కుటుంబం ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులతో కొట్టిమిట్టాడుతోంది. విషయం తెలుసుకున్న మండల కేంద్రానికి చెందిన యువకుడు మీర్ ఇర్షాద్ అలీ మంగళవారం తన జన్మదినం సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.4 వేల ఆర్థికసాయం అందించారు. ఇంటి పైకప్పు నుంచి వర్షపు నీరు వస్తుండడంతో టార్పాలిన్ అందించి మానవతాన్ని చాటాడు. నవీన్, నిఖిల్, మశ్చేందర్, చరణ్, తదితరులు ఉన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

తాంసి: భీంపూర్ పీహెచ్‌సీలో మంగళవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అర్లి, గిరిగాం, అందర్‌బంద్ ఆరోగ్య ఉప కేంద్రాలకు చెందిన గర్భిణులకు వైద్యాధికారి నిఖిల్‌రాజ్ వైద్యపరీక్షలు చేశారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పించారు. హెచ్ఈవో జ్ఞానేశ్వర్, స్టాఫ్‌నర్సు ప్రియాంక, ఎం.హెల్.హెచ్.పి సంధ్యారాణి, సాహితీ, ఏఎన్ఎంలు గోదావరి, జనాబాయ్ ఉన్నారు.

ఈదురుగాలులతో వర్షం



నేరడిగొండలో కురుస్తున్న వర్షం

నేరడిగొండ: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. మండలంలో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. రైతులు విత్తనాలు వేయడంలో బిజీబిజీగా మారనున్నారు.

తాంసి: తాంసి, పాలోది, జామిడి, కప్పర్ల, సావర్గాం, గోట్కూరి, గిరిగాం గ్రామాల శివారులో మంగళవారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. ఇప్పటికే పత్తి విత్తనాలు వేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.